www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 26 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృథ్వీరాజు | సంపుటి - 07, సంచిక-196 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



## రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్

### నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-54 రాకెట్

**బెంగళూరు, నవంబర్ 25 (సమ సమాజం):** శుక్రవారం ఉదయం 10.26 నిమిషాలకి రాకెట్ ప్రయోగానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 11.56 గంటలకు రాకెట్ ప్రయోగం చేయనున్నట్టు సోమనాథ్ తెలిపారు. పీఎస్ఎల్వీ సీ-54 రాకెట్ ద్వారా 9 ఉపగ్రహాలను నింగిలోకి పంపుతున్నామన్నారు. డిసెంబర్ నెలలో అగ్నికుల్ ప్రవేటు సంస్థ రాకెట్ ప్రయోగం జరుగుతోందన్నారు. ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాన్ని తిరిగి చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నా యన్నారు. 2023 ఫిబ్రవరి నెలలో జీఎస్ఎల్వీ - మార్క్-3 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టనున్నామని డాక్టర్ సోమనాథ్ పేర్కొన్నారు.

## కొత్త సభ్యులతో నూతన స్వయం సహాయక బృందాలు


### అధికారులను ఆదేశించిన సిఎస్ సోమేశ్ కుమార్



**హైదరాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** రాష్ట్రంలో కొత్త సభ్యులతో నూతన స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలలో గ్రూపుల్లో చేరని సభ్యులను గుర్తించి కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల పనితీరుపై బీఆర్ కేఆర్ భవన్లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐటి,పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి రఘునందన్ రావ్, జీహెచ్ ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు 2వ

## హైదరాబాద్ లో మరో వంతెన

### ఐటి కారిడార్లో మరో వంతెన ప్రారంభించిన కెటిఆర్



**హైదరాబాద, నవంబర్25 (సమ సమాజం):** హైదరాబాద్ నగర సిగలో మరో వంతెన చేరింది. శిల్పా లేఅవుట్ మొదటి దశ పై ఓవర్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శుక్రవారం ప్రారంభించారు. ఐటీ కారిడార్‌ను ఓఆర్ఆర్‌తో అనుసంధానం చేస్తూ రూ. 250 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించింది. ఐకియా మాల్ వెనుక నుంచి నిర్మించిన 2వ

## ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో బెయిల్ పిటిషన్




### ముగ్గురు నిందితుల బెయిల్‌పైనేడు విచారించనున్న కోర్టు

### ముగ్గురి జ్యూడిషియల్ రిమాండ్ 9 వరకు పొడిగించిన ఎసిబి కోర్టు

**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** ఫాం హౌస్ కేసుకు సంబంధించి జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయగా.. న్యాయమూర్తి దాన్ని తిరస్కరించారు. దీంతో ఏసీబీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ రామచంద్ర భారతి, నంద కుమార్, సింహయాజీలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ధర్మాసనం శనివారం విచారణ జరపనుంది. నిందితుల పిటిషన్ ను పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించింది. తామైతే ఎప్పుడో 2వ

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ విచారణ

### సిట్ ఎదుట హాజరైన లాయర్ ప్రతాప్ గౌడ్



**హైదరాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. మరో నలుగురికి నోటీసులు ఇచ్చారు. 41ఏ సీఆర్పీసీ కింద నోటీసులు అందుకున్న అంబర్ పేటకు చెందిన లాయర్ పోగులకొండ ప్రతాప్ గౌడ్ తో పాటు.. నందకుమార్ భార్య చిత్రలేఖ విచారణ కోసం సిట్ ఎదుట హాజరయ్యారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు తొలిత ప్రతాప్ గౌడ్ రాగా.. కాసేపటికి

## బిజెపి కండువాకప్పకున్న మర్రి శశిధర్ రెడ్డి

### కేంద్ర మంత్రుల సమక్షంలో పార్టీలో చేరిక

### తెలంగాణలో కాంగ్రెస్ పనైపోయిందని వ్యాఖ్య

### టిఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము బిజెపికే ఉందని వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 25 (సమ సమాజం):** మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరారు. కేంద్రమంత్రులు శర్బానంద సోనోవాల్, కిషన్‌రెడ్డిల సమక్షంలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ పనైపోయిందని ఎద్దేవాచేశారు. టీఆర్ఎస్‌ను ఎదుర్కోవడం కాంగ్రెస్ వల్ల కాదని తేల్చిచెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం బీజేపీతోనే సాధ్యమవుతుందని మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. మోడీ నాయకత్వంలో దేశం ముందుకు వెళుతోందని ... తాను ఎంతో ఆలోచించాకే బీజేపీలో చేరానన్నారు. ఢిల్లీలో జరిగిన ఈ 2వ

## మాకూ వివాహ యోగం కల్పించండి

### స్వలింగ సంపర్కుల పిటిషన్



**న్యూఢిల్లీ, నవంబర్ 25 (సమ సమాజం):** స్వలింగ సంపర్కుల పిటిషన్ పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. స్వలింగ సంపర్కుల వివాహాన్ని ప్రత్యేక వివాహ చట్టం కింద చట్టబద్ధంగా గుర్తించాలని కోరుతూ.. హైదరాబాద్‌కు చెందిన స్వలింగ సంపర్కుల 2వ

## ఐటి అధికారిపై కేసులో హైకోర్టు స్టే

**హైదరాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** ఐటీ అధికారిపై కేసులో హైకోర్టు 4 వారాలు స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశించింది. మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి ఫిర్యాదు మేరకు.. ఐటీ అధికారి రత్నాకర్‌పై బోయినపల్లి పీఎస్‌లో కేసు నమోదయింది. ఐపీసీ సెక్షన్ 384 కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదు అయింది. దీంతో తనపై కేసును కొట్టివేయాలని 2వ

## అమితాబ్ ఫోటోలు, వాయిస్‌ల వాడకంపై నిషేధం

### ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ




**న్యూఢిల్లీ, నవంబర్ 25 (సమ సమాజం):** బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ అనుమతి లేకుండా ఆయన ఫొటో, వాయిస్, వ్యక్తిగత లక్షణాలను వినియోగించకుండా ఢిల్లీ కోర్టు శుక్రవారం తాత్కాలిక నిషేధాన్ని విధించింది. తన సమ్మతి లేకుండా తన ఇమేజ్, వాయిస్, వ్యక్తిగత లక్షణాలను వినియోగించకుండా రక్షణ 2వ

## పానీపూరీ యమ డేంజర్

### అంటువ్యాధులు వస్తాయన్న హెల్త్ డైరెక్టర్



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కాలంలో పానీపూరి తినడం చాలా ప్రమాదమని చెప్పారు. రాష్ట్రంలో చాలామంది టైఫాయిడ్ తో బాధపడుతున్నారని, పానీపూరి తినడంవల్లే ఎక్కువమంది జ్వరాలబారిన పడుతున్నట్లు పరిశీలనలో తేలిందని చెప్పారు. ఈ టైఫాయిడ్‌కు మరోపేరుగా 'పానీపూరి డిసీజ్' అని చెప్పుకోవచ్చన్నారు. పానీపూరి వ్యాపారస్తులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పానీపూరీలో పోసే నీటిని వేడిచేసి, వడపోసి శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. దోమలు, ఈగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదీ ఏమైనా ప్రజలు ఈ కాలంలో పానీపూరి తినడం మానుకోవాలని సూచించారు. కామెర్లు, ప్రేగులలో మంటకు కారణమయ్యే పానీపూరీని ఎక్కువగా తీసుకోకపోవడం మంచిదని స్పష్టం చేశారు. అంతలా తీనాలనిపిస్తే.. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## భరోసా కేంద్రానికి మంత్రి భూమిపూజ

### పర్వతగిరిలో అభివృద్ధి పనుల పరిశీలన



**వరంగల్, నవంబర్ 25 (సమ సమాజం):** జిల్లాలోని మహిళా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో భరోసా కేంద్రానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోలీసులకు విస్తృత అధికారాలు ఇచ్చి, వారికి గౌరవం ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమని అన్నారు. గతంలో పోలీసులకు వాహనాలు ఉండేవికాదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. ముఖ్యమంత్రి 3వ

## మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు



### ల్యాప్‌టాప్ చోరీ జరిగిందన్నైటి అధికారి రత్నాకర్

### పోలీసుల వద్ద ఉన్నది తనది కాదన్న అధికారి

**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి 2వ

## రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న మోడీ

### విపక్షాలను బెదిరించేందుకే ఐటి, ఇడి దాడులు

### బండి సంజయ్‌వి దొంగ ఏడుపులన్న కూనంనేని



**హనుమకొండ, నవంబర్ 25 (సమ సమాజం):** భవిష్యత్‌లోనూ టీఆర్ఎస్ తో కలిసి పనిచేస్తాం... కానీ అది టీఆర్ఎస్ చేతిలోనే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటే తప్ప ముందుదకు సాగలేమన్నారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీజేపీపై ఇలాగే పోరాటం చేస్తేనే తమమద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారపిపాసిలా తయారయ్యారని విమర్శించారు. దేశంలో అరాచకం కొనసాగుతోందని... డిక్టేటర్ లాగా మోదీ పాలన ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఇలాలేదని తెలిపారు. ప్రతిపక్ష ముక్త్ భారతే మోదీ విధానమని మండిపడ్డారు. ఎనిమిది రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేశారని... తెలంగాణలో విఫలయత్నం చేశారన్నారు. ఈడీ, ఐటీ, ఎలక్షన్ కమిషన్, జుడీషియరీ ఉపయోగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడు 2వ

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు

### ఆర్థిక వనరులను కట్టడి చేసే కుతంత్రాలు

### ఐటి దాడులు బిజెపి కుట్రలో భాగమే

### కేంద్రం వైఖరి మారకుంటే గుణపాఠం తప్పదు

### ఘాటుగా హెచ్చరించిన మండలి ఛైర్మన్ గుత్తా



**నల్లగొండ, నవంబర్ 25 (సమ సమాజం):** తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వనరులను కట్టడి చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని 2వ

# సంపాదకీయం

## బిజెపి అభివృద్ధి నినాదం..ఓ ఎండమావి !

ఏ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి రావాలన్నదే ఇప్పుడు బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యంగా మారింది. ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలను అస్థిరపరచడం..అవసరమైతే బుల్‌డోజ్ చేయడం.. అధికారంలోకి రావడానికి ఎత్తులు వేయడం అన్న రీతిలో కేంద్రంలోని బిజెపి పాలన సాగుతోంది. గుజరాత్ లో ఇప్పుడున్న బిజెపి ప్రభుత్వాన్ని తిరిగి నిలబెట్టుకునే యత్నాలు కూడా జోరుగా సాగుతున్నాయి. అక్కడ ప్రజలను మరోమారు ఏమార్చే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ముందు ఇవే లక్ష్యాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించే సాహసం చేయడం లేదు. అలాగే నిరుద్యోగం, ఆకలి, ధరలు తదితర అంశాలు కూడా వెనక్కి పోయాయి. ప్రపంచంలో ఏ దేశంలో లేని అపారమైన యువశక్తి భారత దేశంలో ఉంది. నేటి దేశ జనాభాలో 90 కోట్ల మంది పని చేసే వయస్సుగల వారే. వీరందరికీ ఉపాధి కల్పిస్తేనే దేశం అభివృద్ధి బాటలో పయని స్తుంది. వస్తు ఉత్పత్తి పెరిగి విదేశీ మారకం లభిస్తుంది. పాలకులకు సరైన విధానాలు లేకపోవటం వలన యువశక్తి నిర్వీర్యమై దేశ అభివృద్ధి తిరోగమన దిశలో సాగుతున్నది. ఉద్యోగ, ఉపాధి కల్పన లేక యువత నిరాశ, నిస్పృహకులోనై పెడ మార్గంలో పయనించటం, ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతున్నది. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్‌డిఎ 2014 సాధారణ ఎన్నికల సందర్భంలో తాము అధికారంలోకి వస్తే ప్రతియేటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేసి మోసపుచ్చింది. నిరుద్యోగంతో అల్లాడుతున్న యువత దానికి ఆకర్షితులై ఎన్‌డిఎకు ఓట్లు వేసి మోసపోయారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కల్పన అన్న మాట మర్చిపోయి, ఉద్యోగ, ఉపాధిని హరించే విధానాలు చేపట్టింది. ఫలితంగా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జిఎస్టీ వసూళ్లు పెరిగిన తీరును చూసి దేశం బ్రహ్మాండం గా అభివృద్ధి సాధించిందని చంకలు గుద్దుకుంటు న్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను సంక్షోభంలోకి నెట్టటమే కాకుండా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పూర్తి గా దెబ్బతీశాయి. నిరుద్యోగం పెరుగుతూ వస్తున్నది. ప్రభుత్వంలో కానీ, ప్రభుత్వరంగ సంస్థల్లో కానీ నియాకాలు అన్నవి ఎండమావిలా మారాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడంతో ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తున్న వ్యవసాయరంగ కుదేలవుతున్నది. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి భరోసా అన్నది లేకుండా పోయింది. అందుకే ప్రజలు విదేశాల బాటపడుతున్నారు. ఉపాధిని వెతుకుతూ వెళుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కెసిఆర్ అన్నట్లుగా ముంబాయి, బొగ్గుబాయి, దుబాయి అన్న చందంగా ప్రజల బతుకులు మారాయి. ఉపాధి కోసం ఇప్పటికీ గల్ఫ్ బాట పడుతున్నారు. ఇక తెలుగురాష్ట్రాలను తీసుకుంటే తెలంగానలో కెసిఆర్ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప బిజెపి ఎజెండాలో మరో కార్యక్రమం లేదు. వచ్చేది తమప్రభుత్వమే అని ప్రచారం చేసుకోవడం మినహా మరో ప్రచారం లేదు. ఎపిలో జగన్ ప్రభుత్వం పై కూడా ఇదే పంథాలో సాగుతున్నారు. ఎంతసేపు కెసిఆర్ కుటుంబపాలన, అవినీతి అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో బిజెపి నేతలు ముందుకు సాగుతు న్నారు. ఒక్కటంటే ఒక్క సమస్య అయినా తీసుకుని కెసిఆర్‌తో చర్చించి..కేంద్రం నుంచి ఎలా పరిష్కారం సాధించా లో ప్రయత్నించిన దాఖలాలు లేవు. కిషన్ రెడ్డి మొదలు నేతలు అందరూ ఇదే పంథాలో నడుస్తు న్నారు. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వ పాలన సాఫీగా సాగిపోతున్నదని, దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ప్రచారం చేసుకోవడం మినహా మరో కార్యక్రమం ప్రజల ముందు కానరావడంలేదు. ఎనిమిదేళ్లుగా ఏం సాధించారన్నది నిలదీస్తే నీళ్లు నమలడం తప్ప మరోటి కానరాదు. గత ఐదారేళ్లుగా

నిరుద్యోగం బుసలు కొడుతున్నా పట్టింపు లేదు. బిజినెస్ టుడే నివేదిక ప్రకారం నోట్ల రద్దు తర్వాత ప్రభుత్వ ఏజెన్సీ నిర్వహించిన ఉపాధి మొదటి సర్వే నివేదిక ప్రకారం దేశంలో 17-జులై 2017లో సాధారణ నిరుద్యోగ స్థితి 6.1శాతంగా ఉంది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా అన్ని రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. రైతుల భూములను కార్పొరేట్ల స్వాధీనం చేయటానికి తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. రైతాంగం పండించే పంటలకు న్యాయమైన ధరలు ప్రకటిం చడం లేదు. సేద్యపు ఖర్చులు పెరిగి రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి సాగు నుంచి రైతాంగం వైదొలగేలా కుట్రలు సాగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరించటం పెద్ద సాగుతోంది. వాటిని అమ్మి వేయటం, అనేక పరిశ్రమలను మూసివేయటం చాలా ఉధృతంగా సాగుతోంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తే ఉపాధి అవకాశాలు పెరుగు తాయి. అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. సామాన్యలకు,చిన్నవ్యాపారులకు రుణాలు దక్కడం లేదు. సవాలక్ష కొర్రీలు పెట్టి తిరస్కరిస్తున్నారు. మోసగాళ్లకు,ఎగవేతదారులకు మాత్రమే బ్యాంకులు బార్లా తెరచి ఉన్నాయి. పరిశ్రమలు మూసివేత, అమ్మివేత వలన లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవటమే కాకుండా వాటి ఆధారంగా బతికే పట్టణ పేదలు ఉపాధి కోల్పోతున్నారు. వీరంతా నిరుద్యోగులుగా మిగులు తున్నారు. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వ పాలన బ్రహ్మాండవగా ఉందని సాగుతున్న సోషల్ మీడియాప్రచారం చూస్తే పాలనలోని డొల్లతనాన్ని గుర్తించవచ్చు. దేశం అభివృద్ధి బాటలో పయని స్తున్నదని పదేపదేగా ప్రచారం ప్రచారం తప్ప మరోటి కానరాదు. మోసేవాడికి బరువు తెలుస్తుందన్న సామెత మేరకు ...నిరుద్యోగంతో బాధపడుతున్న యువతకు, ఉపాధి దొరక్క అలమటిస్తున్న పేదలకు భారం ఏమిటో తెలుస్తుంది. నిరుద్యోగం, అప్పుల కారణంగా ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించదని తేలిపోయింది. దేశీయ పారిశ్రామిక విధానాలు ప్రజల అవసరాలు తీర్చేలా లేవు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ప్రజలకు ఉద్యోగ, ఉపాధి లభించదు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. ఇవన్నీ గుర్తించి ప్రభుత్వాలను నిలదీస్తే తప్ప మనుగడ సాధ్యం కాదు. పార్లమెంట్ సమావేశాల్లో ఇలాంటి సమస్యలపై చర్చకు స్థానం లేకుండా పోయింది. విపక్షాలు ఏ అంశం లేవనెత్తినా వాయిదా వేసి పలాయనం చిత్తగించే ప్రభుత్వం మననెత్తిన ఉందన్న విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. అక్కడ సమస్యలపై చర్చించాలి. చర్చలకు సమాధానం రావాలి. కానీ మోడీ వచ్చాక పార్లమెంటులో చర్చలకు తావులేకుండా పోయింది.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్



## కొత్త సభ్యులతో నూతన స్వయం సహాయక బృందాలు

(మొదటి పేజి తరువాయి) హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 6,06,000 స్వయం సహాయక బృందాలలో 64 లక్షల మంది సభ్యులున్నారని తెలిపారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 4 ,30 ,785 బృందాలలో 46 కుపైగా సభ్యులుండగా, పట్టణ ప్రాంతాల్లో ఉన్న 1,76,623 బృందాలలో దాదాపు 18 లక్షల మంది సభ్యులున్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.హెచ్.జి గ్రూపులు, సభ్యుల వివరాలను పూర్తి స్థాయిలో అప్-డేట్ చేయాలని, అనంతరం గ్రూపుల్లోని సభ్యులందరికీ క్యూఆర్ కోడ్ కలిగిన ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పొందుతున్న వడ్డీ లేని రుణాల మొత్తాలను ఉత్పాదక రంగాలలో ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని సోమేశ్ కుమార్ సూచించారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం ద్వారా వారి ఆదాయ మార్గాలను పెంపొందించేందు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీ అడిషనల్ కమిషనర్ శృతి ఓఝా, సెర్ప్ డైరెక్టర్ వై.ఎన్. రెడ్డి, శ్రీనిధి ఎండి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ విచారణ

(మొదటి పేజి తరువాయి) నందకుమార్ భార్య చిత్రలేఖ వచ్చారు. ఫాం హౌస్ కేసుకు సంబంధించి సిట్ అధికారులు వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా నందకుమార్ ఆర్థిక లావాదేవీలపై ఆయన భార్య చిత్రలేఖను ప్రశ్నించే అవకాశముంది. ఇదిలా ఉంటే సిట్ నోటీసులను సవాల్ చేస్తూ అడ్వొకేట్ ప్రతాప్ గౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం హాజరుకావాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే తదుపరి ఆదేశాల వరకు ప్రతాప్ గౌడ్ ను అరెస్ట్ చేయవద్దని స్పష్టం చేసింది.

### మాకూ వివాహ యోగం కల్పించండి

(మొదటి పేజి తరువాయి) జంట సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వీరి పిటిషన్ పై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తమకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కు పౌరులకు కూడా వర్తిస్తుందని.. స్వలింగ సంపర్కులైన సుప్రియో చక్రవర్తి, అభయ్ డాంగ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రియో చక్రవర్తి , అభయ్ డాంగ్‌లు కలిసి10 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. గత సంవత్సరం (2021) డిసెంబరు నెలలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు , స్నేహితుల సమక్షంలో 9వ వార్షికోత్సవం జరుపుకున్నారు. కమ్యూనిటీ సభ్యులు తమకు నచ్చిన వ్యక్తిని విహహం చేసుకోవడానికి ప్రాథమిక హక్కులను అమలు చేయాలని సుప్రీం కోర్టును కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కమ్యూనిటీ సభ్యులు ఇతర పౌరులతో పాటు సమాన హక్కులు కల్పించాలని కోరారు.

## హైదరాబాద్ లో మరో వంతెన



(మొదటి పేజి తరువాయి) ఈ వంతెన ఓఆర్ఆర్‌పైకి చేరనున్నది. ఇనార్బిట్ మాల్, రహేజా మైండ్ స్పేస్ చౌరస్తా, బయో డైవర్సిటీ చౌరస్తా మధ్య నిర్మిస్తున్న హైదరాబాద్ నాలెడ్జ్ సెంటర్‌ను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ప్రాజెక్టుల్లో ఇది మూడోది. వంతెన పొడవు 956 మీటర్లు కాగా.. వెడెల్పు 16 మీటర్లు. హైదరాబాద్‌లోని ఫ్లై ఓవర్లలో ఇదే అతి పొడవైనది కావడం విశేషం. ఎస్ఆర్‌డీపీలో భాగంగా చేపట్టిన పనుల్లో పూర్తయిన 17వ ప్రాజెక్టు. ఓవర్ ప్రారంభంతో గచ్చిబౌలి జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.,÷నాన్స్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ మధ్య రోడ్ కనెక్టివిటీ మరింత పెరగనున్నది. కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. వంతెనను ప్రారంభించిన అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు.

## ఐటి అధికారిపై కేసులో హైకోర్టు స్టే

(మొదటి పేజి తరువాయి) కోరుతూ ఐటీ అధికారి రత్నాకర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం స్టే ఇస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.మంత్రి మల్లారెడ్డి నివాసంలో 48 గంటలు సోదాలు జరిగిన తర్వాత అర్ధరాత్రి హైడ్రామ జరిగింది. ఐటీ అధికారులు సంతకాలు పెట్టించుకోవడంలో తమకు మోసం జరిగిందని చెబుతూ మంత్రి కుమారుడు భద్రారెడ్డి ఐటీ అధికారి రత్నాకర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ కేసును సవాల్ చేస్తూ అధికారి హైకోర్టులో ఫిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ వాదనలు జరిగాయి. ఇరువైపు వాదనలు విన్న అనంతరం హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో బెయిల్ పిటిషన్




(మొదటి పేజి తరువాయి) బెయిల్ ఇచ్చేవారమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. రామచంద్ర భారతి, నంద కుమార్, సింహయాజీలు గతంలోనూ బెయిల్ కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. అయితే దర్యాప్తు సమయంలో నిందితులకు బెయిల్ ఇస్తే కేసు, సాక్ష్యులను ప్రభావితంచేసే అవకాశముందని పోలీసులు వాదించారు. దీంతో ఏసీబీ కోర్టు వారి బెయిల్ పిటిషన్ ను తిరస్కరించింది. మరోవైపు ఫాం హౌస్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు నిందితుల జ్యూడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు పొడగించింది. రామచంద్ర భారతి, నంద కుమార్, సింహయాజీల రిమాండ్ గడువు ముగియడంతో పోలీసులు వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కోర్టు వారి జ్యూడీషియల్ రిమాండ్‌ను డిసెంబర్ 9వ తేదీ వరకు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ ముగ్గురిని చంచల్ గూడా జైలుకు తరలించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేశారన్న కేసులో ముగ్గురు నిందితుల కస్టడీ పిటిషన్‌ను ఏసీబీ స్పెషల్ కోర్టు గురువారం కొట్టివేసింది. ముగ్గురు నిందితులను ఇప్పటికే రెండురోజుల కస్టడీకి అనుమతించామని, మరోసారి కుదరదని సిట్ అధికారులకు తేల్చి చెప్పింది. గతంలో నవంబర్ 10, 11, తేదీల్లో ముగ్గురి నిందితులను కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు పలు అంశాలపై ప్రశ్నించారు. కొంత సమాచారాన్ని రాబట్టారు. అయితే, దర్యాప్తులో భాగంగా కొన్ని ముఖ్య విషయాలు వెల్లడయ్యాయని వాటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు మరో ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టును కోరారు.

## బిజెపి కండువాకప్పుకున్న మర్రి శశిధర్ రెడ్డి



(మొదటి పేజి తరువాయి) కార్యక్రమానికి బండి సంజయ్, లక్ష్మణ్, డీకే ఆరుణ, వివేక్ వెంకటస్వామి ఇతర నేతలు హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్ కు శశిధర్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రజలు మంచి సర్కారును కోరుకున్నా..అది రాలేదని శశిధర్ రెడ్డి అన్నారు. మొత్తం ప్రపంచంలో ఇంత అవినీతి ప్రభుత్వం ఎక్కడా లేదని ఆరోపించారు. గత ఎనిమిదిన్నర ఏళ్లుగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఫెయిల్ అయింద న్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం బీజేపీతోనే సాధ్యమవుతుందని, ఇలాంటి ఘట్టంలో భాగస్వామ్యం అవుతున్నందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్న శశిధర్ .. రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఏర్పాటుకు ప్రాణాలు అర్పించడానికి కూడా సిద్ధమేనన్నారు. అటు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన అనంతరం ఆ పార్టీ పై శశిధర్ రెడ్డి కీలకమైన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి క్యాన్సర్ సోకిందని, అది నయం చేయలేని స్థితికి చేరుకుందన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనే పరిస్థితి కాంగ్రెస్ కు లేదన్నారు . రేవంత్ వ్యవహార శైలి సరిగ్గా లేదని ఆయన తీరు వల్లే ఈరోజు చాలా మంది కాంగ్రెస్ పార్టీని వీడుతున్నారని ఆరోపించారు. రేవంత్ వైఖరి వల్ల తెలంగాణలో కాంగ్రెస్ ఉనికిని కోల్పోతుందన్నారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను కలిసిన శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శశిధర్‌రెడ్డిని కాంగ్రెస్ బహిష్కరించింది. ఆ తరువాత రెండు రోజులకే ఆయన ఆ పార్టీకి రాజీనామా చేస్తూ సోనియా గాంధీకి లేఖ రాశారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన శశిధర్‌రెడ్డి... కాంగ్రెస్ నేతలపై పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ విప్ ఈరవత్రి అనిల్ డిమాండ్ చేశారు. లేదంటే పరువునష్టం కేసును ఎదుర్కోవాల్సి వస్తుందని గురువారం శశిధర్ రెడ్డికి ఆయన లీగల్ నోటీస్ కూడా పంపారు.

## అమితాబ్ ఫోటోలు, వాయిస్‌ల వాడకంపై నిషేధం



కల్పించాలంటూ అమితాబ్ ఢిల్లీ కోర్టును కోరారు. తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా తన పేరు, ఇమేజ్, వాయిస్‌లను దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ముఖ్యంగా మొబైల్ అప్లికేషన్ డెవలపర్స్, పుస్తక ముద్రణ సంస్థలు, కెబిసితో చట్టవిరుద్ధంగా సంబంధం కలిగిన లాటరీ నిర్వాహకులు, టి షర్ట్స్ విక్రయించేవారితో పాటు ఇతర వ్యాపార సంస్థలు ఆయన ఇమేజ్‌ను దుర్వినియోగం చేస్తున్నాయని అమితాబ్ తరపున హాజరైన న్యాయవాది హరీష్ సాల్వే తెలిపారు. కొందరు చట్టవిరుద్ధంగా తన పేరుతో వెబ్ డొమైన్లు నమోదు చేశారని అన్నారు. సెలబ్రిటీగా ఆయన ప్రచార హక్కును ఉల్లంఘించడమేనని (మొదటి పేజి తరువాయి) పేర్కొన్నారు. దీంతో అమితాబ్ అనుమతి లేకుండా ఏ వ్యక్తి గానీ, సంస్థ గానీ ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను ఉపయోగించకుండా జస్టిస్ నవీన్ చావ్లా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అమితాబ్ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా ఉన్న కంటెంట్‌ను తొలగించాలని ఐటీ శాఖ అధికారులు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లను ఆదేశించారు. దీంతో ఆయన ఇమేజ్‌కు నష్టం వాటిల్లడంతో పాటు ఆయనకు చెడ్డపేరు వస్తుందని అన్నారు. కొన్ని సంస్థలు వారి ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసేందుకు నటుడి అనుమతి లేకుండానే ఆయన సెలబ్రిటీ హోదాను ఉపయోగించడం ఆయనను బాధించిందని కోర్టు పేర్కొంది.

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు




(మొదటి పేజి తరువాయి) విమర్శించారు. ఐటీ రైడ్స్ బీజేపీ వ్యూహంలో భాగమేనని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం బీజేపీ ఐటీ రైడ్స్ పేరుతో మంత్రులను ఇబ్బంది పెడుతోందని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం వైఖరి మార్చుకోవాలన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలంటే.. అభివృద్ధి చేసి చూపించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు. ప్రజలకు మంచిచేస్తే వారే అందలం ఎక్కిస్తారని అన్నారు. అడ్డదారులతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. అయితే అధికారం కోసం బీజేపీ తప్పుడు విధానాలు అవలంబిస్తున్నదని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఎంతకైనా తెగించెలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. ఆర్థిక వనరులను కట్టడి చేయాలనే దురాలోచనలో ఉందని చెప్పారు. ఇది ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగించే చర్య అని మండిపడ్డారు. కేంద్ర తన పరిధిలో ఉన్న అన్ని శాఖలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్నదని, వ్యక్తిగత కక్షకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీలో రాష్ట్రానికి రావలసిన వాటా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర వైఖరి మారాలని సూచించారు. తెలంగాణకు డబుల్ ఇంజన్ సర్కార్ రావాలంటే అభివృద్ధి చేసి చూపించాలని, ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలన్నారు. దానికి విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారని వెల్లడించారు. ఐటీ, ఈడీ, సీబీఐలతో బీజేపీ యేతర నాయకులను ఇబ్బందులకు గురిచేస్తుం దన్నారు. సిద్ధాంతపరంగా కేంద్ర పరిపాలన జరగడం లేదని, ప్రజా స్వామ్యబద్ధంగా ప్రభుత్వాలు ప్రజల మన్నన పొందాలని చెప్పారు.

## మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు

(మొదటి పేజి తరువాయి) మల్లారెడ్డి ఇండ్లు, కార్యాలయాలు, సంస్థలపై ఐటీశాఖ దాడుల కేసులో విచారణ కొనసాగుతోంది. ఐటీశాఖ అధికారి రత్నాకర్.. మంత్రి మల్లారెడ్డిపై చోరీ కేసు పెట్టారు. ప్రస్తుతం బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్‌లో ఒక ల్యాప్ టాప్ అయితే ఉంది. ఆ ల్యాప్ టాప్‌ను తీసుకెళ్లాలని పోలీసులు ఐటీ అధికారి రత్నాకర్‌ను కోరారు. కానీ, 36 గంటలు గడుస్తున్నా దాన్ని తీసుకెళ్లలేదు. బోయిన్ పల్లి పీఎస్ లో ఉన్న ల్యాప్ టాప్ తనది కాదని ఐటీ అధికారి రత్నాకర్ చెబుతున్నారు. తన ల్యాప్‌టాప్ ను తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరుతున్నారు. మంత్రి మల్లారెడ్డి ఇంట్లో సోదాల సందర్భంగా ఐటీ ఆఫీసర్ రత్నాకర్ ల్యాప్ టాప్ మాయమైంది. తన ల్యాప్ టాప్ ను దొంగిలించి.. సాక్ష్యాలను తారుమారు చేశారని రత్నాకర్ బోయిన్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేసుపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఐటీ ఆఫీసర్ రత్నాకర్ ఫిర్యాదుతో ల్యాప్‌టాప్‌ను తిరిగి ఇవ్వాలని మంత్రి మల్లారెడ్డికి బోయిన్ పల్లి పోలీసులు సూచించారు. దీంతో ఆయన ఇంటికి వెళ్లారు. తన అనుచరులతో మంత్రి మల్లారెడ్డి ఒక ల్యాప్‌టాప్ పంపించారు. అయితే.. అది తమది కాదని ఐటీ అధికారి రత్నాకర్ చెప్పారు. వేరే ల్యాప్‌టాప్ తెచ్చారని, తమ ల్యాప్‌టాప్‌లో విలువైన సమాచారం ఉందని తెలిపారు. మల్లారెడ్డి అనుచరులు తీసుకొచ్చిన ల్యాప్ టాప్ తీసుకునేందుకు నిరాకరించారు. తర్వాత నిన్న ఉదయం 3 గంటల 30 నిమిషాల సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు డెల్ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్‌ను తీసుకువచ్చారు. పోలీస్ స్టేషన్ లోపలికి వారిని అనుతించకపోవడంతో అక్కడే ఉన్న ప్రహరీ గోడ గేట్ వద్ద ల్యాప్ టాప్ పెట్టి వెళ్లిపోయారు. అయితే ఆ ల్యాప్‌టాప్‌ను ఐటీ అధికారులు తీసుకోలేదు. పథకం ప్రకారమే ల్యాప్‌టాప్‌ను తారుమారు చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్ష్యాలు లభించకుండా ఉండేందుకు ఎ÷-లాన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఐటీ అధికారుల సూచనల మేరకు ల్యాప్‌టాప్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న మోడీ

(మొదటి పేజి తరువాయి) తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.విపక్ష నేతలను లొంగతీసుకునేందుకే ఈడీ దాడులని ఆరోపించారు. పోసాని మురళీకృష్ణకు నకలు బండి సంజయ్ అని... చట్టాలు తెలియని అజ్ఞాని బండి సంజయ్ అని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేల ఎరకేసులో అమిత్ షాను రప్పిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయన్నారు. అమిత్ షా కు సిట్ ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీపీఐ వర్సెస్ బీజేపీ గా పోటీ చేద్దాం, దమ్ముంటే రా బండి అంటూ సంజయ్‌కు సవాల్ విసిరారు. ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ రావు హత్యను ఖండిస్తున్నామన్నారు. పోడు భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాజ్యాంగ, స్వతంత్ర, ప్రభుత్వ వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం దుర్వినియోగం చేస్తున్నదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశంలో ఆటవిక రాజ్యం సాగుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రత్యర్థి పార్టీల నాయకులను లొంగదీసుకొనేందుకు వ్యవస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తుంటే, దానిని తట్టుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే పని చేయాల్సి వస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో మంత్రులు గంగుల కమలాకర్, సీహెచ్ మల్లారెడ్డిపై ఈడీ, ఐటీ దాడులు రాజకీయ ప్రేరేపితమేనని ఆరోపించారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో బీజేపీ నేత బీఎల్ సంతోష్‌కు సిట్ నోటీసులిస్తే.. బండి సంజయ్ ఎందుకు ఏడుస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం సాయిబాబా, వరవరరావు వంటి వందల మందిని జైళ్లలో మగ్గేలా చేస్తే ఎందుకు కన్నీళ్లు పెట్టలేదని నిలదీశారు. బీఎల్ సంతోష్ ఎందుకు సిట్ ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆయనేమైనా రాజ్యాంగానికి, వ్యవస్థకు అతీతుడా? అని నిలదీశారు. ఎంఎల్‌ఏల కొనుగోలు వ్యవహారంతో తమకు సంబంధం లేదని చెప్పిన బీజేపీ, ఆ కేసును సీబీఐకి ఇవ్వాలని పిటిషన్ ఎందుకు వేసిందని ప్రశ్నించారు. గత ఎనిమిదేండ్లలో ఈడీ మూడు వేలకుపైగా సోదాలు చేసిందని, అందులో ఒకటైనా నిరూపితమైందా? అని నిలదీశారు. ఈడీ సోదాలు చేసిన వ్యక్తుల్లో ఒకరైనా బీజేపీ నాయకులు ఉన్నారా? అని ప్రశ్నించారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీబీఐ ఛార్జ్ షీట్ దాఖలు

**న్యూఢిల్లీ,నవంబర్ 25 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీబీఐ తొలి ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. సుమారు 10 వేల పేజీల ఛార్జ్ షీట్ ను అధికారులు దాఖలు చేశారు. ఏడుగురిపైన సీబీఐ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఛార్జ్ షీట్ లో ఎ1 గా కుల్దీప్ సింగ్, ఎ2 గా నరేంద్ర సింగ్, ఎ3గా విజయ్ నాయర్, ఎ4 గా అభిషేక్ బోయిన పల్లి ఉన్నారు. ఇవాఈ ఛార్జ్ షీట్ పై రోస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనుంది. ఈ కేసులో మొదట సీబీఐ విచారణ జరిపింది. ఆ తర్వాత ఈడీ రంగంలోకి దిగింది. విజయ్ నాయర్, అభిషేక్ రావుకు ఇప్పటికే సీబీఐ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దానిపై స్టే ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించింది. కేసులో బోయినపల్లి అభిషేక్‌కు సీబీఐ స్పెషల్ కోర్టు నిన్న 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. విజయ్ నాయర్?కు మరో 2 రోజులు ఈడీ కస్టడీని పొడిగించింది.

## సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థుల్లో ప్రతిభకు సాన

### వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభించిన మంత్రి సత్యవతి



**మహబూబాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలికల) స్కూల్, జూనియర్ కాలేజీలో నిర్వహించిన జిల్లా వైజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయవచ్చని వెల్లడించారు. పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని అన్నారు.సర్కార్ బడులల్లో అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రవేశపెట్టిన మనఊరు-మనబడితో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయిని స్పష్టం చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఉపకరణాలు, ఆదర్శ గ్రామాలు, స్వచ్ఛభారత్, నూతన సాగు పద్ధతులు, రీసైక్లింగ్ ప్రాసెస్, వినూత్న వైజ్ఞానిక ఆవిష్కరణలను మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కుమారి అంగోత్ బిందు, శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, డీఈవో, ప్రిన్సిపాల్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనావాసాల్లోకి వచ్చిన చిరుత

### దాడిలో ముగ్గురికి గాయాలు

### ఎట్టకేలకు పట్టుకున్న అటవీ అధికారులు

**ముంబయి,నవంబర్ 25 (సమ సమాజం):** అడవి నుంచి తప్పించుకున్న ఓ చిరుతపులి హౌసింగ్ కాంప్లెక్సులోకి ప్రవేశించింది.ఈ ఘటన మహారాష్ట్రలోని కళ్యాణ్ నగరంలో వెలుగుచూసింది.కళ్యాణ్ తూర్పులోని చిచ్‌పాడ వద్ద ఉన్న అనుగ్రహ టవర్ నివాస భవనంలోకి పెద్ద మగ చిరుతపులి ప్రవేశించింది. ఈ చిరుత దాడిలో అటవీ అధికారితో సహా ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. చిరుత దాడిలో గాయపడిన వారిలో మనోహర్ గైక్వాడ్, రాజీవ్ పాండేలు శ్రీరామ్ అనుగ్రహ హౌసింగ్ సొసైటీ భవనంలో నివాసం ఉంటున్నారు. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న ఫారెస్ట్ ఆఫీసర్ దినేష్ గుప్తాపై చిరుత దాడి చేసింది. చిరుతపులి మొదట ఉదయం 8 గంటలకు కనిపించిందని, సొసైటీ ఆవరణలో,చుట్టుపక్కల తిరుగుతూనే ఉందని స్థానికులు తెలిపారు. కళ్యాణ్‌లోని నివాస పరిసరాల్లో చిరుతపులి కనిపించడం ఇదే తొలిసారి అని భవనం నివాసి కిరణ్ గుప్తా చెప్పారు. ఉదయం 10 గంటలకు అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని భవనం మొత్తాన్ని సీల్ చేశారు. లోపల ఉన్న నివాసితులు ఇళ్లలోనే ఉండాలని, బయట ఉన్నవారిని ఇళ్లలోకి అనుమతించడం లేదని చెప్పారు. చిరుతకు ట్రాంక్విలైజర్ షాట్ ఇచ్చి పట్టుకున్నామని డిప్యూటీ కన్జర్వేటర్ సంతోష్ చెప్పారు.

## భరోసా కేంద్రానికి మంత్రి భూమిపూజ





(మొదటి పేజి తరువాయి) ఆలోచనలను ఇంప్లిమెంట్ చేస్తున్న డైనమిక్ సీపీ తరుణ్ జోషీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ బాస్కర్ , ఎంపీ దయాకర్ , హనుమకొండ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు , వరంగల్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పాల్గొన్నారు.ఇదిలావుంటే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుక్రవారం తన స్వస్థలమైన పర్వత గిరిలో వేణుగోపాల స్వామి ఆలయం, పర్వతాల గుడి శివాలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసిందని, భక్తి భావం ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. స్వామివారికి నూతన రథాన్ని తయారు చేయించాలని, స్థల సేకరణ చేసి కల్యాణ మంటపం నిర్మించాలని సూచించారు. పర్వతాలగిరిపై ఐదు కోట్ల రూపాయలతో శివాలయం నిర్మించారని ఈ ఆలయాన్ని జనవరి 26న ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆలయానికి కావలసిన విద్యుత్, మంచినీటి వసతి, రవాణా, భక్తుల సదుపాయాల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శివాలయానికి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు విశాలమైన స్థలంలో పార్కింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇన్‌చార్జి డీపీవో సంపత్ రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఏసీపీ నరేష్ కుమార్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

## నిత్య జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలి



### క్రికెట్ పోటీల ప్రారంభంలో మంత్రి తలసాని

**హైదరాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ప్రపంచంలో ఎన్ని రకాల క్రీడలు ఉన్నా.. క్రికెట్‌కు ఉన్న క్రేజీ వేరని చెప్పారు. కరోనాతో ఒక ఏడాది పాటు క్రీడలకు దూరమైన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ఎక్కువ టీంలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని గురు గోవింద్ సింగ్ మైదానంలో తలసాని యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మంత్రి తలసాని ప్రారంభించారు. తలసాని యువసేన ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ పోటీల్లో 80 టీమ్స్ పాల్గొంటున్నాయ న్నారు. ఆదివారం ÷నైల్ మ్యాచులు జరుగుతాయని ..విజేతలకు రూ. 25వేల నగదు బహుమతి, రన్నరప్?కు రూ. 15 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న జట్లు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు.

## అభివృద్ధిని చూసి టిఆర్ఎస్‌లో చేరికలు: మంత్రి



**నల్లగొండ,నవంబర్ 25 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి టీఆర్ఎస్ పార్టీలో ఉత్సాహంగా చేరుతున్నారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులతో పాటు సుమారు వెయ్యి మంది టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తో కలిసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు.

## అరవింద్ కేజ్రీవాల్ హత్యకు బిజెపి కుట్ర

### మనీష్ సిసోడియా సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,నవంబర్ 25 (సమ సమాజం):** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను హత్యచేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందంటూ డిప్యూటి సిఎం మనీష్ సిసోడియా శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ భద్రతపై తనకు ఆందోళనగా ఉందని అన్నారు.గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఢిల్లీ మునిసిపల్ ఎన్నికల్లో ఆప్ చేతుల్లో ఓటమి పాలౌతామని బిజెపి భయపడుతోందని సిసోడియా పేర్కొన్నారు. దీంతో కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని, బిజెపి ఎంపి మనోజ్ తివారీ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ÷ూగా, భారీ అవినీతి, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్లను అమ్ముకోవడం, రేపిస్టులతో స్నేహం, జైల్లో ఆప్ మంత్రికి సకల సౌకర్యాలతో మసాజులు వంటి పరిణామాల పట్ల ఆప్ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారని గురువారం మనోజ్ తివారీ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆప్ ఎమ్మెల్యేలపై ప్రజలు దాడులు చేస్తున్న ఘటనలను చూస్తున్నామని, ఇలాంటి అనుభవం కేజ్రీవాల్‌కు ఎదురు కాకూడదని కోరుకుంటున్నట్లు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ట్వీట్‌పై సిసోడియా స్పందిస్తూ.. కేజ్రీవాల్ హత్యకు కుట్ర పన్నుతున్నట్లు ఆయన ట్వీట్ బయట పెట్టిందని అన్నారు. కేజ్రీవాల్ పై దాడి చేయాలని ఇప్పటికే తన గూండాలను మనోజ్ తివారీ పురమాయించినట్లు బహిరంగంగా చెప్పారని, ఇప్పటికే పక్కా ఎ÷-లాన్ ను సిద్ధం చేశారని అన్నారు. ఇలాంటి కుట్రపూరిత రాజకీయాలకు ఆప్ భయపడదని హెచ్చరించారు. బిజెపి కుట్రలను ప్రజలు తిప్పికొడతారని, ఎన్నికల్లో వారిని ఓడిస్తారని అన్నారు.

## క్షేత్రస్థాయిలో అటవీ అధికారులకు భద్రత



### వారికి అండగా రంగంలోకి పోలీస్ యంత్రాంగం

### అధికారులతో సమీక్షలో ఆదేశాలు ఇచ్చిన డిజిపి

### ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్‌లో స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,నవంబర్ 25 (సమ సమాజం):** అటవీ అధికారులు, సిబ్బందికి మద్దతుగా నిలవాలని, భరోసా కల్పించాలని పోలీసులను డీజీపీ మహేందర్ రెడ్డి అదేశించారు. కొత్తగూడెం లాంటి సంఘటలను పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. అటవీశాఖ, క్షేత్ర స్థాయి సిబ్బంది సమస్యలపై అటవీ సంరక్షణ ప్రధాన అధికారి డోబ్రియల్‌తో కలిసి డీజీపీ మహేందర్ రెడ్డి పోలీస్ ఉన్నతాధికారులు, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పరిధిలోని చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా అటవీ అధికారులతో స్వయంగా సమావేశం కావాలని పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలకు సూచించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కూడా తమ పరిధిలోని అటవీ అధికారులతో సమావేశం కావాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగానే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన అటవీ అధికారి హత్యతో అటవీ అధికారుల్లో భయాందోళలు నెలకొన్నాయి. పోడు సర్వేలో పాల్గొనేందుకు అధికారులు ససేమిరా అంటున్నారు. తమకు ఆయుధాలు ఇవ్వాలని అంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి రక్షణగా పోలీసులు నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో డిజిపి వారికి సూచనలుచేశారు. మరోవైపు డిమాండ్లను పరిష్కరిస్తేనే సర్వే చేస్తామని చెబుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా పోడు సర్వే నిలిచిపోయింది. ప్రభుత్వ ద్వంద్వ నీతితోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని ఆదివాసీ, గిరిజన, పోడుదారు ల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం అటవీ అధికారుల డిమాండ్లపై నిర్ణయం తీసుకోక పోతే.. పోడు హక్కు పత్రాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని అంటున్నాయి. కాగా, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నా, లేకపోయినా.. సర్వే, గ్రామసభలు జరుగుతాయని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్థానిక అధికారులు లబ్దిదారులతో చెప్పినట్టు తెలుస్తోంది.పోడు పత్రాల జారీ కోసం చేపట్టిన సర్వేలో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతుండగా, కొన్ని చోట్ల గ్రామసభల్లో ఇబ్బందు లు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో వాస్తవిక పోడు సాగుదారులతో పాటు వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా దరఖాస్తులు పెట్టుకున్నారు. దీంతో సాగు భూమి గుర్తింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యలన్నీ సర్వేల్లోనే తేలాల్సి ఉన్నా గ్రామసభల వరకూ వెళు న్నాయి. క్షేత్రస్థాయి సమస్య గ్రామసభల వరకూ వెళ్తుండటంతో అది అక్కడ పరిష్కారం కావడం లేదు. హరితహారం మొక్కలు నాటిన భూముల్లోనూ సర్వే చేయాలని డిమాండ్లు వస్తున్నందునే ఘర్షణ వాతావరణం నెలకొంటోందని తెలిపారు. హరితహారం మొక్కలు నాటాలని ప్రభుత్వం అటవీ అధికారులకు లక్ష్యం నిర్దేశిరచి, మరోవైపు పోడు పత్రాల జారీకి ఏర్పాట్లు చేయాలని సూచించడం తో.. శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోడు సర్వే, గ్రామ సభలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అదనపు బృందాలను తీసుకోవాలని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సూచించినా ఇంతవరకు ఒక్క అదనపు బృందమూ ఏర్పాటు కాలేదు. సిబ్బంది కొరత, సర్వేలో చోటుచేసుకుంటున్న ఘటనలతో అటవీ అధికారులు నిరాసక్తత కనబరుస్తుండడంతో పోడు హక్కు పత్రాల జారీ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో అధికారి శ్రీనివాసరావు హత్యప్రభుత్వాన్ని కలచివేసింది.దీంతో అటవీ అధికారులకు ముందు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఏర్పడింది. అందుకే సిఎం కెసిఆర్ ఆదేశాలతో డిజిపి అప్రమత్తం అయ్యారు.

## న్యాయమూర్తుల బదిలీ

### ఆందోళనకు దిగిన న్యాయవాదులు

**అమరావతి,నవంబర్ 25 (సమ సమాజం):** తెలుగు రాష్ట్రాల్లో ఐదుగురు న్యాయమూర్తులు.. మొత్తం ఏడుగురు జడ్జిలను బదిలీ చేస్తూ కొలీజియం సిఫారసు చేసింది. ఈ క్రమంలోనే హైకోర్టు జడ్జిలు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ డి.రమేష్ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో జడ్జిల బదిలీకి నిరసనగా ఏపీ

హైకోర్టులో లాయర్లు విధులను బహిష్కరించారు. కొలీజియం నిర్ణయానికి వ్యతిరేకంగా లాయర్లు విధులు బహిష్కరించారు. ఏపీ బార్ నుంచి ఎన్నికైన ఇరువురు జడ్జిలను బదిలీ చేయడంపై.. ఏపీ హైకోర్టు న్యాయవాదులు నిరసన తెలిపారు. ఉత్తర, దక్షిణ భారత్ జడ్జిల బదిలీల్లో వివక్ష చూపుతున్నారని లాయర్లు ఆరోపిస్తున్నారు.

## తిరుమలలో కొనసాగుతున్నరద్దీ

### తలనీలాలతో భారీగా ఆదాయం రాక

**తిరుమల,నవంబర్ 25 (సమ సమాజం):** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 7 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 16 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 66,072 మంది స్వామివారిని దర్శించుకోగా 25,239మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.23 కోట్లు వచ్చిందని వివరించారు. ఇదిలావుంటే తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తలనీలాల ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. దేశంలో అన్ని ఆలయాల కంటే తిరుమలలోని ఏడుకొండస్వామి చెంత భక్తులు అధిక సంఖ్యలో తలనీలాలు సమర్పించుకుంటారు. ప్రతిరోజు స్వామివారిని దర్శించుకునేవారిలో 30శాతం మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటారు. ఇలా భక్తుల సమర్పించుకున్న తలనీలాలను టీటీడీ ప్రతి యేట ఆన్‌లైన్‌లో వేలం వేస్తుంది. ఈ-వేలం సైట్‌లో టీటీడీ వివిధ రకాల సైజుల్లోని తలనీలాలకు వేలం నిర్వహించగా పాటదారులు 21,100 కేజీలకు బిడ్ చేశారు. ఇలా వేలం వేసిన తలనీలాల ద్వారా టీటీడీకి ఈ యేడాది మొత్తం రూ.47.92 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

## విపక్షాలపై ఎదురుదాడి లక్ష్యంగా పాలన

### వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారాలు ● పోలవరం,ప్రత్యేక హోదాలపై కానరాని లక్ష్యం

**అమరావతి,నవంబర్ 25 (సమ సమాజం):** వైసిపి పాలనలో ఇప్పుడు విమర్శలు, దాడులకే ప్రాధాన్యం పెరిగింది. విపక్షాల ప్రశ్నలకు సమాధానాలు రావు. రుషికొండను ఎందుకు తవ్వుతున్నారో చెప్పరు. అక్కడేం చేస్తున్నారో తెలియదు. మొత్తంగా రాష్ట్రంలో పాలన అన్నది ఎదుటివారిని విమర్శించేలే సాగుతోంది. ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు మొత్తంగా విమర్శలపైనే ఆధారపడ్డారు. సిఎం జగన్ కూడా ఈ మధ్య ఎక్కడా టిడిపిని,జనసేనను వదలకుండా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రత్యేక హోదాను గత ప్రభుత్వం కేంద్రానికి తాకట్టు పెట్టిందని, పోలవరం ప్రాజెక్టును లంచాల కోసం చంద్రబాబు చేపట్టారని, అమరావతి చంద్రబాబు బినామీలదని అబద్దాలు ప్రచారం చేసిన జగన్ వాటిని సరిదిద్దే ప్రయత్నాలు చేయలేదు. పోలవరం అన్నది ఇక మూలన పడిందన్న భావన ప్రజల్లో నాటుకునిపోయింది.రాష్ట్రంలో జరిగే ప్రతి అంశాన్నీ ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఆపాదిస్తూ, నిందలు వేస్తూ, ఏ ఒక్క సంఘటనకూ ప్రస్తుత ప్రభుత్వం బాధ్యత తీసుకోవటం లేదు. ఈ మూడేళ్ల పాలనా కాలంలో ముఖ్యమంత్రి కానీ, ఆయన మంత్రివర్గ సహచరులు కానీ విపక్షాలపై ఎదురుదాడి వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. పాలనంతా బ్రహ్మాండంగా ఉందని, హామీలను 99శాతంనెరవేర్చామని చెప్పుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక హోదాను ఢిల్లీకి తాకట్టు పెట్టిందని, హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ కొరకు కక్కుర్తి పడిందనీ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే, ఢిల్లీ వెళ్లి కేంద్రం మెడలు వంచి హోదా తీసుకు వస్తామని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఢిల్లీ వెళ్ళారు కానీ, మోదీ మెడలు వంచలేదు. హోదా తేలేదు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వైకాపా అవసరం లేదని, కాబట్టి ఢిల్లీ వెళ్ళినప్పుడల్లా 'ప్లీజ్ ప్లీజ్' అంటూ అడుగుతుంటామని చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినా అడుగు ముందుకు పడడంలేదు. దీని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అయినా గతంలో చంద్రబాబు ప్రభుత్వం కేవలం లంచాల కోసం, అవినీతి కోసం తాను నిర్మాణం చేస్తానని చేపట్టారు. తన అనుయాయులకు, అయిన వారికి ఇచ్చారని ప్రజలను నమ్మించారు. పోలవరాన్ని ఏటీఎంగా, పేటీఎంగా వాడేసుకుంటున్నట్లు ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే పోలవరం రివర్స్ టెండర్ల పేరిట కాంట్రాక్టర్లను మార్చారు. పోలవరాన్ని కేంద్రానికి అప్పచెప్పకుండా చంద్రబాబు ఇచ్చిన కాంట్రాక్టర్లకే పనులను కట్టబెట్టారు. అదిగో... ఇదిగో అన్న ప్రాజెక్టు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా చెప్పలేని విధంగా మార్చేశారు. మరో రెండేళ్లలోను పోలవరం పూర్తి కాదు అన్న పరిస్థితి తెచ్చారు. 77 శాతం పూర్తి చేసిన పోలవరం పనులను మూడేళ్ళ పాలనలో మరో పది శాతం కూడా పూర్తి చేయలేకపోయారు. ఏపీ రాజధానిగా అమరావతిని చంద్రబాబు కంటే ఎంతో మిన్నగా నిర్మిస్తామని చెప్పారు. రాజధానికి 30 వేల ఎకరాలు కావాలనీ అసెంబ్లీలోనే ప్రకటించారు. రాజధాని మార్పుపై తనపై వచ్చే అబద్దాలు, కారుకూతలని ప్రతిపక్ష హోదాలో జగన్ మోహన్ రెడ్డి అన్న మాటలు ప్రజల మరువలేదు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రాజధానిపై ఉక్కుపాదం మోపారు. ఎడారి అనీ, స్మశానం అనీ, కమ్మవారిదే అనీ, చంద్రబాబు బినామీలది అనీ చాలా రకాలుగా విమర్శలు చేశారు. అన్నిప్రాంతాల అభివృద్ది అంటూ మూడు రాజధానుల ముచ్చటను తెరపైకి తెచ్చారు. ఆంధ్రుల రాజధాని అమరావతిని దేశ ప్రజల ముందు నవ్వులపాలు చేశారు. అసలు రాజధాని అంటే ఏదనే స్థాయికి తీసుకుని వచ్చారు. ఆంధ్రుల హక్కుగా నిర్మాణం జరిగిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేతకు కూడా ప్రభుత్వం భరోసా ఇవ్వలేకపోతోంది. కేంద్రాన్ని నిలదీయలేక పోయింది. మొత్తంగా తనదైన ముద్ర వేసి పాలనలో కొత్తదనం చూపిస్తారనుకున్న వారికి జగన్ పాలన నిరాశగా మారిందనే చెప్పాలి.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఎత్తివేతపై ఆందోళన

**మంచిర్యాల,నవంబర్ 25 (సమ సమాజం):** గొల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ఆందోళన చేశారు. ఆరేళ్లుగా గ్రామంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఈ సారి ఎత్తివేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న ఐకేపీ సెంటర్ ఎత్తివేయడంతో దళారుల చేతిలో మోస పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క గొల్లపల్లి గ్రామంలోని రైతులు దాదాపు 60 లారీల ధాన్యం పండించడం జరుగుతోంది. ఇంత ధాన్యాన్ని..ఇంతమంది రైతులు ఇబ్బందిపడుతూ ఇతర ప్రాంతాలకు ఎలా తీసుకెళ్లాలని గ్రామస్తులు ప్రశ్నించారు. అధికారులు తమపై కక్ష కట్టినట్లు ఎందుకువ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వెంటనే తమ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు.




# చలన చిత్రం

## ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం ..అందరికీ నచ్చే సినిమా




అల్లరి నరేష్, ఆనంది జంటగా ఎ.ఆర్.మోహన్ దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన చిత్రం 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం'. శుక్రవారం సినిమా విడుదలయ్యింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో నరేష్? మాట్లాడుతూ 'ఇదొక హానెస్ట్ సినిమా. మన చుట్టూ జరిగే కథ. గిరిజన గ్రామాల్లోని ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారనే రియల్ స్టోరీ ఆధారంగా దీన్ని రూపొందించాం. ఔట్‌పుట్ చూశాక చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. థియేటర్ నుంచి బయటికి వస్తూ శ్రీచరణ్ పాకాల మ్యూజిక్ గురించి, అబ్బూరి రవి డైలాగ్స్ గురించి మాట్లాడుకుంటారు. కొత్త ప్రయత్నంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాం' అన్నాడు. 'మెసేజ్‌తో పాటు అందరికీ అవగాహన కల్పించే విధంగా ఉంటుంది. కనక లక్ష్మి పాత్ర ఇచ్చిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్' అని చెప్పింది ఆనంది. దర్శకుడు మాట్లాడుతూ 'లైఫ్‌లో ఈ సినిమా నాకు చాలా ఇంపా÷-టగ్గ÷ంట్. ఇందులో మేం చూపించిన విధంగా ఇంకా చాలామంది బతుకుతున్నారు. వాళ్ల జీవితాన్నే స్క్రీన్‌పై చూపిస్తున్నాం. ఇదంతా మేం చేసిన టీమ్ వర్క్. మంచి కంటెంట్‌తో వస్తోన్న ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి, ఇంత మంచి కథతో నిర్మాతగా పరిచయం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది అన్నారు నిర్మాత రాజేష్ దండా. షానీ, కొమురం, శ్రీ తేజ్, చోటా కె ప్రసాద్, అబ్బూరి రవి, శ్రీ చరణ్ పాకాల పాల్గొన్నారు.




కొన్ని రోజుల క్రితం తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఇంటింటి రామాయణం ప్రాజెక్ట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. రాహుల్ రామకృష్ణ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ మూవీ టీజర్ మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంతో సురేష్ నరెడ్ల దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నాడు. విలేజ్‌లో వివిధ పాత్రల మధ్య నడిచే ఫన్ అండ్ కూల్ ఎలిమెంట్స్‌తో ఇంటింటి రామాయణం సినిమా సాగనున్నట్టు టీజర్‌తో చెప్పేశాడు దర్శకుడు. టీజర్‌తో సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో నరేష్, నవ్య స్వామి, గంగవ్వ, బిత్తిరి సత్తి కీలక పాత్రలు పోషిస్తున్నారు. విలేజ్ డ్రామానేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మారుతి ప్రొడక్షన్స్ నిర్మిస్తుండగా.. నిర్మాత నాగ వంశీ, ఆహా సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఈ వెబ్ ప్రాజెక్ట్‌కు కళ్యాణ్ మాలిక్ సంగీతం అందిస్తున్నారు.

## ఘోస్ట్ చిత్రం స్టన్నింగ్‌లుక్ విడుదల




కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం ఘోస్ట్. సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి శ్రీని దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ ఫిల్మ్‌గా వస్తున్న ఈ మూవీ నుంచి మేకర్స్ స్టన్నింగ్ లుక్ ఒకటి విడుదల చేశారు. ఘోస్ట్ మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. శివరాజ్‌కుమార్ టీం భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసిన సెకండ్ షెడ్యూల్ డిసెంబర్ లో మొదలుకానుంది. శివరాజ్‌కుమార్ ఇంటెన్స్ లుక్‌తో పాన్ ఇండియా కథాంశంతో రాబోతున్న ఈ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాడు. శివరాజ్‌కుమార్ తెలుగులో నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్ పోషించిన గౌతమి పుత్ర శాతకర్ణి చిత్రంలో అతిథి పాత్రలో నటించారు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, నందమూరి తారకరామారావు కుటుంబానికి మంచి అనుబంధం ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ ఇద్దరు లెజెండరీ యాక్టర్ల కుమారులుగా శివరాజ్‌కుమార్, నందమూరి బాలకృష్ణ నటవారసత్వంతోపాటు అనుబంధాన్ని కూడా కొనసాగిస్తున్నారు




## చలనచిత్రోత్సవంలో అఖండ స్క్రీనింగ్

నందమూరి అభిమానులను ఖుషీ చేసే అప్‌డేట్ వచ్చేసింది. బాలకృష్ణ కెరీర్‌లో వన్ ది స్పెషల్ మూవీగా నిలిచింది అఖండ. ఈ బ్లాక్ బస్టర్ మూవీ గోవాలో జరుగుతున్న 53వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో స్క్రీనింగ్ అయింది. ఈవెంట్‌లో సినిమా హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను, నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. ఈ ముగ్గురు థంబ్స్ అప్ సింబల్ చూపిస్తూ కెమెరాకు ఫోజులిచ్చారు. ఈ ఫొటో ఇపుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ చిత్రంలో బాలకృష్ణ డ్యుయల్ రోల్‌లో నటించాడు. అఖండ బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. ఎస్ థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అఖండ విజయంలో కీ రోల్ పోషించింది. ఈ మూవీలో ప్రగ్యా జైశ్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. శ్రీకాంత్, పూర్ణ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 28న చలన చిత్రోత్సవాలు ముగియనున్నాయి.

## ఆకట్టుకుంటున్న తేజ హనుమాన్ టీజర్




సాధారణంగా యువ హీరోలు రొటీన్ ఫార్ములాతో కెరీర్‌ను మొదలుపెడుతుంటారు. ఇలా కెరీర్ షురూ చేసిన వారిలో సక్సెస్ అయిన వాళ్లు కొందరు, సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నవారు మరికొందరు. కానీ కొందరు యాక్టర్లు మాత్రం కెరీర్‌ను డిఫరెంట్‌గా ప్లాన్ చేసుకుని.. ప్రేక్షకులను ఇంప్రెస్ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి వారి జాబితాలో ముందువరుసలో ఉంటాడు యువ నటుడు తేజ సజ్జ తేజ సజ్జ చైల్డ్ ఆర్టిస్టుగా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి.. ప్రస్తుతం హీరోగా తనను తాను నిరూపించుకునే పనిలో ఉన్నాడు. తేజ సజ్జ చేస్తున్న సినిమాలు గమనిస్తే.. ఇతడు కెరీర్‌ను పక్కాగా ప్లాన్ చేసుకున్నట్టు అర్థమవుతుంది. మొదట సమంత ప్రధాన పాత్రలో నటించిన ఓ బేబి చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించాడు తేజ సజ్జ . ఈ సినిమాలో తేజ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తర్వాత హీరోగా తొలిసారే ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో ప్రయోగాత్మక సినిమా జాంబిరెడ్డిలో నటించాడు. ఈ మూవీ కూడా డిఫరెంట్ కథాంశం కావడంతో చాలా మంది ప్రేక్షకులను ఆకట్టుకుంది. సోలో హీరోగా తేజ సజ్జకు మంచి బ్రేక్ ఇచ్చింది. ఇపుడు రెండోసారి ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో హనుమాన్ సినిమాతో వస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్ పాన్ ఇండియా ప్రేక్షకులను సైతం ఆకట్టుకునే విజువల్స్ తో సాగుతుంది. తేజ సజ్జ కెరీర్ ఎ÷-లాన్ కోసం పక్కా రూట్ మ్యాప్ ఎలా క్రియేట్ చేసుకున్నాడో చెప్పేందుకు ఈ ఒక్క టీజర్‌తో క్లారిటీ వచ్చేస్తుందంటున్నారు సినీ జనాలు.

## వీరసింహారెడ్డి జై బాలయ్యపాటకు ఫిదా




నటసింహ నందమూరి బాలకృష్ణ మరియు క్రాక్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ వీరసింహా రెడ్డి సంక్రాంతి సందర్భంగా విడుదల కాబోతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 'వీరసింహా రెడ్డి' ఫస్ట్ లుక్ – టైటిల్ టీజర్ మరియు ఇతర ప్రత్యేక పోస్టర్లు మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఫస్ట్ సింగిల్ 'జై బాలయ్య' మాస్ ఆంథమ్ ని రిలీజ్ చేయడంతో మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభించారు మేకర్స్. 'రాజసం నీ ఇంటి పేరు.. పౌరుషం నీ ఒంటి పేరు.. నిన్ను తలచుకున్న వారు.. లేచి నిల్చొని మొక్కుతారు.. అచ్చ తెలుగు పౌరుషాల రూపం నువ్వయ్యా.. అలనాటి మేటి రాయలోరి తేజం నువ్వయ్యా..' అంటూ సాగిన 'జై బాలయ్య' సాంగ్ శ్రోతలను ఆకట్టుకుంటుంది. హీరో పాత్రని ఎలివేట్ చేస్తూ సాగిన ఈ పాటలో నటసింహం రాజసం చూపించారు. మాస్ లీడర్ గా వైట్ అండ్ వైట్ లో బాలయ్య ఆకట్టుకున్నారు. జై బాలయ్య సాంగ్ కి ఎస్ థమన్ ట్యూన్ సమకూర్చారు. ఇది 'ఒసేయ్ రాములమ్మ' టైటిల్ ను గుర్తు చేస్తుండటం గమనార్హం. 'తిప్పు సామీ కోర మీసం.. తిప్పు సామీ ఊరి కోసం.. అగ్గి మంటే నీ ఆవేశం.. నిన్ను తాకే దమ్మున్నోడు లేనే లేడయ్యా.. ఆ మొలతాడు కట్టిన మొగోడింకా పుట్టలేదయ్యా..' అంటూ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి నందమూరి ఫ్యాన్స్ ను ఆకట్టుకునే సాహిత్యం అందించారు. సింగర్ కరీముల్లా హుషారుగా ఈ గీతాన్ని ఆలపించారు. లిరికల్ వీడియో మాదిరిగా కాకుండా ఒక కవర్ సాంగ్ లా 'జై బాలయ్య' మాస్ ఆంథంని అందించారు. తమన్ సైతం వైట్ అండ్ వైట్ ధరించి కాలు కదిపారు. ఈ పాటకు శంకర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసారు. జన సమూహాల మధ్య దేవాలయాల పరిశరాలలో ఈ పాటని చిత్రీకరించారు. రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేశారు. నవీన్ నూలి ఎడిటింగ్ విభాగం చూసుకున్నారు.మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని – వై రవిశంకర్ లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చందు రావిపాటి దీనికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. ఇందులో బాలకృష్ణ సరసన శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ గా నటిస్తుండగా.. వరలక్ష్మి శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తోంది. లాల్ – నవీన్ చంద్ర – రాజీవ్ కనకాల ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. చంద్రిక రవి స్పెషల్ సాంగ్ చేసింది. సంక్రాంతి స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకురాబోతున్న 'వీరసింహా రెడ్డి' సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in